క్లుప్తంగా

పేటకు వెళ్లి.. పింఛన్ అందజేసి...

వినుకొండ టౌన్: పట్టణంలోని 27వ వార్డుకు చెందిన షేక్ లాల్బి అనారోగ్యంతో బాధపడుతూ నరసరావుపేటలోని ఓ ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న 10వ వార్డు సచివాలయ అడ్మిన్ పి.ఆదిలక్ష్మి స్వయంగా వృద్ధురాలి వద్దకు వెళ్లి ఆమెకు అందవలసిన వైఎస్సార్ పింఛన్ నగదు 2750 రూపాయలను అందచేసింది. ఫించన్ దారుని పట్ల అడ్మిన్ ఆదిలక్ష్మి చూపిన శ్రద్ధకు 27వ వార్డు సచివాలయ కన్వీనర్ షేక్ మౌలాలి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వార్డు సభ్యులు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలియచేశారు.

ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాలి



చిలకలూరిపేట: ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాలని ఆర్యవైశ్య విద్యానిధి సంఘం కన్వీనర్ పొట్టి శ్రీరాములు చెప్పారు. ఆర్యవైశ్య విద్యానిధి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కల్యాణమండపంలో విద్యార్థిని పి.దీప్తికి రూ. 17 వేలు ఉపకార వేతనం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం కారణంగా ప్రతిభ గల విద్యార్థులు చదువులకు దూరం కాకుండా ఆర్యవైశ్య విద్యానిధి సంఘం గత 16 సంవత్సరాలుగా ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నదని వెల్లడించారు. కార్యక్రమంలో విద్యానిధి కార్యదర్శి మాజేటి నరేంద్ర, సభ్యులు పొట్టి బదిరి, కేవీఎస్ కృష్ణుడు పాల్గొన్నారు.

శ్రీ శ్రీ కళావేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాకేష్



నరసరావుపేట: ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక పల్నాడు జిల్లా జనరల్ సెక్రెటరీగా గుండాల రాకేష్ నియమితులయ్యారు. బుధవారం దీనికి సంబంధించిన నియామక ఉత్తర్వులు అందుకున్నారు ఆయన. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి, శ్రీశ్రీ కళావేదిక జిల్లా జనరల్‌సెక్రెటరీగా నియమించడం పట్ల ఎంతో సంతోషం కలిగిస్తోందన్నారు. తెలుగు వెలుగుల పరిమళాలను వెదజల్లుతూ సుమారు 113కు పైగా జాతీయ కవి సమ్మేళనాలను నిర్వహించిన అంతర్జాతీయ సాహిత్య సంస్థ చైర్మన్, గుర్రం జాషువా ప్రభుత్వ అవార్డు గ్రహీత డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి ప్రభావతి, జాతీయ కార్యదర్శి ఈశ్వరి భూషణం, రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరి సర్వోత్తమ నాయుడులకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

శావల్యాపురం: నేడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అధ్యక్షత సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ సర్పంచులు, ఎంపీటీసీలు, మండల గ్రామ స్థాయి అధికారులు అందరు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

వినుకొండ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు పండ్లు, నిత్యవసర వస్తువులను సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ, ఏఐసీటీయూ కార్మిక సంఘం సభ్యులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లిబరేషన్ పార్టీ పట్టణ కార్యదర్శి చిదంబరం, సహాయ కార్యదర్శి షేక్ మెహమ్మద్ రఫీ, ఏఐసీటీయూ కార్మిక సంఘం అధ్యక్షులు భాస్కర్, కార్యదర్శి ఫిరోజ్, దుర్గాప్రసాద్, వైద్యులు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఒయాసిస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

చిలకలూరిపేటటౌన్: సంక్రాంతి ముగ్గులు తెలుగు వారి సంస్కృతికి, సాంప్రదాయానికి నిదర్శనమని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా బుధవారం ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని కేజే ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసి పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కరణం విజయలక్ష్మి, డాక్టర్ ప్రఫుల్లాదేవి, పి.లక్ష్మిరాజ్యం, నాగమల్లేశ్వరి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



దేశంలోనే అత్యధిక పింఛన్ ఇస్తోంది రాష్ట్ర ప్రభుత్వమే

- వైఎస్సార్ పెన్షన్ వారోత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- నియోజక వర్గంలో 1031 మంది నూతన పింఛన్‌దార్లకు రూ.28 లక్షలు పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, వేదికపై నాయకులు, అధికారులు

నరసరావుపేట: దేశంలో ప్రతినెలా ఠంచన్‌గా మొదటి తేదీనే ఇళ్లకు వెళ్లి లబ్ధిదార్లకు నెలకు రూ.2750లు పింఛన్ అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. నియోజకవర్గంలో నూతనంగా మంజూరైన 1031 మంది వైఎస్సార్ పింఛన్ లబ్ధిదార్లకు రూ.28,28,230ల సొమ్ము పంపిణీ కార్యక్రమం బుధవారం మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర అధ్యక్షతన టౌన్ హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి లబ్ధిదారులనుద్దేశించి మాట్లాడుతూ కరోనా వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బంది పడుతున్నా ఒకటో తేదీనే పింఛన్‌ను ముఖ్యమంత్రి అందజేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.1.20 లక్షల కోట్లు అప్పు చేయగా రాష్ట్ర ప్రభుత్వం చేసింది కేవలం రూ.6 లక్షల కోట్లేనన్నారు. అప్పులు చేస్తున్నాడనే ఎల్లో మీడియా, చంద్రబాబు నాయుడు దుష్ప్రచారాన్ని నమ్మ వద్దని, అయినప్పటికీ అప్పులు చేయకుండా పేదలకు ఎక్కడి నుంచి సొమ్ము తీసుకు రావాలని ప్రశ్నించారు. కావాలనే ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నాయన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా పక్షవాతం వస్తే రూ.5 వేలు, కిడ్నీ పేషంట్లకు రూ.10 వేలు, దివ్యాంగులకు రూ.3 వేలు అందజేస్తున్నారన్నారు. చంద్రబాబు 65 ఏళ్లు దాటిన వారికే పింఛన్లు అందజేయగా, ఇప్పుడు 60 ఏళ్లు దాటిన వారికే అందజేస్తున్నారన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలకు, పింఛన్ల దరఖాస్తులకు ఇళ్ల దగ్గరలోని సచివాలయం ద్వారానే మంజూరుచేసి అందజేయటం జరుగుతోందన్నారు.

ఎన్నడూ లేని విధంగా ప్రజలకు సులభతరమైన పరిపాలన ముఖ్యమంత్రి రాష్ట్రంలో అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఇళ్లవద్దకే పింఛన్, రేషన్ బియ్యం పంపిణీ, వ్యవసాయంలో వినియోగించే ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు కేవలం నిందలు వేసే పనే చేస్తున్నాయనీ, గతంలో పింఛన్లు తీసుకోవాలంటే వృద్ధులు గంటల తరబడి నిరీక్షణ చేసి సొమ్మసిల్లి పడిపోయి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. అటువంటి పరిస్థితి మళ్లీ రాకుండా ఉండాలన్నా, పథకాలన్నీ మళ్లీ అందాలన్నా ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలో మంజూరైన నూతన పింఛన్లను మండలాల వారీగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి లబ్ధిదార్లకు పంపిణీ చేసి, చెక్కును అందజేశారు. పింఛన్ పెంపుదలకు చెందిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, నరసరావుపేట, రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యులు పి.చిట్టిబాబు, పి.ఓబుల్‌రెడ్డి, ఎంపీపీలు ఎం.శ్రీనివాసరావు, జి.వెంకట రావు, ముతరాసు కార్పొరేషన్ డైరెక్టర్ ఇయం స్వామి, రొంపిచర్ల మండల పార్టీ అధ్యక్షులు పి.రవీంద్రబాబు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు వి.నాగిరెడ్డి, వడ్డెర సంక్షేమ సంఘ జిల్లా మెంబరు వి.శివ, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకాయమ్మ, మాజీ కౌన్సిలర్ ఎం.రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీఎంకు రుణపడి ఉంటా



ఎస్‌టీ కులుస్తుడినైన తనకు 50 ఏళ్లు దాటినందుకు జగనన్న ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. ఇందుకు సీఎం జగన్‌కు రుణపడి ఉంటా. ఎస్‌టీలకు పరిమితి 50 ఏళ్లకే సీఎం కుదించి పింఛన్ అందజేస్తున్నారు. నాకు భార్య, ఇద్దరు పిల్లలు. పిల్లలకు వివాహాలయ్యాయి. ఈ పింఛన్ సొమ్ము నాకు ఆర్థిక భరోసాన్ని ఇస్తూ బ్రతకాలనే ధైర్యం ఇస్తుంది.

– చలంచర్ల కోటయ్య, బాడుగ రిక్షా కూలీ, లింగంగుంట్ల

పింఛన్‌తో ధైర్యం వచ్చింది



నాకు 60 ఏళ్లు రాగానే వెంటనే పింఛన్ మంజూరుచేసి నాకు ధైర్యాన్ని ఇచ్చారు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి. గతంలో తాను ముఠా కూలీగా పనిచేసే వాడిని. ఇప్పుడు పని చేసుకోలేకపోతున్నా. పింఛన్ సొమ్ముతో నాకు మరింత ధైర్యం వచ్చింది.

– పట్నం తిమ్మయ్య, ముఠాకూలి, రావిపాడు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అత్యధికంగా లబ్ధి

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- బొల్లాపల్లిలో పింఛన్ వారోత్సవాలు



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా

బొల్లాపల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేశామని నియోజకవర్గ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వెల్లడించారు. మండల కేంద్రం బొల్లాపల్లిలో పింఛన్ వారోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ పింఛన్ కానుక పథకం పంపిణీ బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కంటే ప్రస్తుతం జగనన్న హయాంలోనే పింఛనర్లకు లబ్ధి జరిగిందన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, పలు రకాలు వ్యాధులకు గురైన వారికి పింఛన్ అందజేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. ప్రస్తుతం అత్యధికంగా పింఛన్లు లబ్ధి పొందారని తెలిపారు. మండలంలో గతంలో 2019 ముందు 6025 మందికి రూ.61.71 లక్షలు, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 8569 మంది రూ.2.38 కోట్ల మేర లబ్ధిపొందుతున్నారని వివరించారు. గత ప్రభుత్వాలు ఎన్నడూ ప్రజా సంక్షేమం పట్ల శ్రద్ధ చూపలేదని విమర్శించారు. అదే విధంగా ముఖ్యమంత్రి సంక్షేమం, అభివృద్ధిని అమలు చేస్తున్నారని, గ్రామ, పట్టణాల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు చేసి చూపారని వివరించారు.

త్వరలో వరికెపూడిశెల నిర్మాణం

మండల ప్రజలు వైఎస్సార్ సీపీకి ఆదరాభిమానాలు చూపించారని, మండల అభివృద్ధికి కావల్సిన వరికెపూడిశెల ప్రాజెక్టు త్వరలో నిర్మాణం చేపడతామని చెప్పారు. ఫారెస్టు క్లియరెన్సు పూర్తయిందని, టైగర్ ఫారెస్టు క్లియరెన్సు కావల్సి ఉందని, బొల్లాపల్లి మండలాని వరికెపూడిశెల నిర్మాణం కోసం రూ. 950 కోట్లు కేటాయించారని, దుర్గి, వెల్దుర్తి మండలాలకు రూ.350 కోట్లు కేటాయించారని తెలిపారు. త్వరలో వరికెపూడిశెల నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. మండలంలో ఈ ప్రాజెక్టు నిర్మాణంతో లక్ష ఎకరాలకు సాగు నీరు అందుతోందని, తాగునీటికి ఢోకా ఉండదని తెలిపారు. అదేవిధంగా మండలంలో పేరుగాంచిన మన్నేపల్లి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి జరుగు తుందని రహదారి, తాగునీరు, కరెంటు సౌకర్యం కల్పిస్తామని, ఇందుకు సంబంధించి ఫారెస్టు అధికారుల అనుమతి మంజూరైందని తెలిపారు.

భూ రీసర్వేతో రైతులకు లబ్ధి

మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పది వేల మంది రైతులు లబ్ధిపొందారని, వీరందరికీ రెవెన్యూ రికార్డులు సక్రమంగా తయారు చేసి పాసు పుస్తకాలు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం భూ రీసర్వే ద్వారా మరికొంత మంది రైతులకు న్యాయం జరుగుతోందని వివరించారు.

భూ దందాలకు పాల్పడితే సహించం

గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే జీవీ బావమరిది నరసింహారావు భూ దందాలకు పాల్పడ్డారని, మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలో చెరువు భూమి సుమారు 3 వేల ఎకరాలు ఉందని, ఆ ప్రదేశంలో అసైన్డు భూములను ఎస్సీ, ఎస్టీ పేరుతో రికార్డులు తయారు చేసి పిడుగురాళ్ల వారికి అక్రమ విక్రయాల కొనసాగించారని విమర్శించారు. కొప్పుకొండలో, శావల్యాపురంలో భూముల ఆక్రమణ యధేచ్ఛగా జరిగిందని తెలిపారు. ఆయా ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి తొలగించి ప్రభుత్వం స్వాధీన పరచుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తి రాములు, జెడ్పీటీసీ ఆర్.బీమీబాయి కృష్ణానాయక్, జీడీసీసీ బ్యాంకు డైరెక్టరు డి.గోవిందు నాయక్, మండల ఉపాధ్యక్షులు టి.కోటిరెడ్డి, బి.మరియమ్మలు బీసీ కార్పొరేషన్ డైరెక్టరు బత్తి గురవయ్య, ఎంపీడీఏ టి.పార్వతి, తహసీల్దార్ టి.ప్రవీణ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- త్రిపురాపురంలో గడప గడపకు మనప్రభుత్వం



సంక్షేమ పథకాలు తెలియజేస్తున్న ఎమ్మెల్యేతో పాటు నాయకులు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో గత ప్రభుత్వం హయాంలో కంటే గ్రామాలు ఎక్కువగా అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని త్రిపురాపురం గ్రామంలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే సంక్షేమం, అభివృద్ధిలో అన్నీ గ్రామాలు ముందంజలో ఉన్నాయన్నారు. నూజెండ్ల మండలంలో గుండ్లకమ్మ నదిపై ఐదు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, రెండు వంతెనలతో పాటు తలార్లపల్లి-నూజెండ్ల రింగ్ రోడ్లతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. అలాగే తిమ్మాపురం, కొండ్రప్రోలు, అప్పాపురం అగ్రహార భూములు సర్వే చేసి రైతులకు హక్కులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ సుబ్బులు రామయ్య, ఎంపీటీసీ వెంకటేశ్వర రెడ్డి, మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, సొసైటీ చైర్మన్లు పిచ్చిరెడ్డి, పారా వెంకటేశ్వర్లు, కొత్త కృష్ణా రెడ్డిలతో పాటు పలువురు నాయకులు అధికారులు పాల్గొన్నారు.

అగ్రహార భూముల రీసర్వే పనుల పరిశీలన



ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు

వినుకొండ (నూజెండ్ల): అగ్రహార భూములు రీ సర్వే చేసి హక్కులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకే దక్కుతుందని మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి అన్నారు. మండలంలోని అప్పాపురం గ్రామంలో రీ సర్వే పనులను ప్రజాప్రతినిధులు మండల నాయకులు పరిశీలించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అసెంబ్లీలో పలుమార్లు అగ్రహార భూములు విషయంపై పలుమార్లు ప్రస్తావించడంతో ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అగ్రహార భూములు రీ సర్వే చేసి రైతులకు పూర్తి హక్కులు కల్పించాలని ఆదేశించారని వివరించారు. దీంతో అగ్రహార భూములు రీ సర్వేతో రైతులకు అన్ని విధాలా న్యాయం జరిగిందని వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేసి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, సొసైటీ చైర్మన్ పోట్లపల్లి పిచ్చిరెడ్డి, ఓంగూరి ప్రసాదు, మార్కాపురం అల్లూర రెడ్డి, గాదె నాగార్జున రెడ్డి, కనపర్తి శేషగిరిరావు పాల్గొన్నారు.

పిచికలపాలెంలో రీసర్వే పనులు

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనులు ప్రారంభించినట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు బుధవారం తెలిపారు. తహసీల్దారు మాట్లాడుతూ పిచికలపాలెం రెవెన్యూ గ్రామంలో నూతనంగా వోఆర్ఐ చాయాచిత్రాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందుకుగాను 3505 ఎకరాలు భూములు రీసర్వే పనులు చేయాల్సి ఉందన్నారు. రోవర్ ఆధునిక యంత్ర పరికరాలు సచివాలయ సర్వేయర్లు ద్వారా సర్వే పనులు పారదర్శకంగా జరిగేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. రైతులందరూ రెవెన్యూ అధికారులకు సహకరించాలన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ తిరివిధి రమణారావు, మండల డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్ సాయి మోహన్‌రాజు, వీఆర్వో అమలు రైతులు ఉన్నారు.

గ్రేడ్-1 మునిసిపాలిటీగా తీర్చిదిద్దాలి

- సూచించిన వినుకొండ మునిసిపల్ సభ్యులు
- నూతన బడ్జెట్ అంచనాలకు కౌన్సిల్ ఆమోదం



సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక పట్టణ పురపాలక సంఘం సమావేశ మందిరంలో మున్సిపల్ ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. చైర్మన్ డాక్టరు దస్తగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2023-24 బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. వినుకొండ మున్సిపాల్టీ ఆదాయం రూ.1069.89 లక్షలు వచ్చే విధంగా బడ్జెట్‌ను రూపొందించినట్లు కౌన్సిల్ సభ్యులకు తెలియజేశారు. పట్టణ పరిసర గ్రామాలను మున్సిపాలిటీలో చేర్చి గ్రేడ్-1 మున్సిపాలిటీగా రూపొందించినట్లయితే ఆదాయం పెరుగుతుందని పలువురు సభ్యులు సూచించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన చైర్మన్ రానున్న రోజుల్లో కౌన్సిల్ సభ్యుల సూచనల మేరకు గ్రేడ్-1 మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు తెల్లాకుల రాజేష్ ఖన్నా, బేతం గాబ్రియేలు కమిషనర్ బి.శ్రీనివాసులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమం

నాదెండ్ల: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలుచేస్తూ ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమం దరిచేరుస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలన సువర్ణయుగమని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గణపవరం 1వ సచివాలయంలో బుధవారం నూతనంగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుక పెన్షన్ల నగదును పంపిణీ చేశారు. కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి అర్వపల్లి శేఖర్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని సహకారంతో గ్రామంలోని నాలుగు సచివాలయాల పరిధిలో 63 మందికి నూతనంగా మంజూరుకాగా, ఇప్పటి వరకూ 4 సచివాలయాల పరిధిలో 2313 మందికి పెన్షన్ అందనుంది. కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ ఆదంవలి, తులం సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు కోటేశ్వరరావు, జ్యోతిర్మయి, కె. కవిత, ఎ.శేఖర్, డిజిటల్ అసిస్టెంట్లు దయానిధి, ఖాజావలీజర్, పాల్గొన్నారు.

వర్సిటీ ఖోఖో జట్టుకు కృష్ణవేణి విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పురుషుల ఖోఖో జట్టుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు బుధవారం తెలిపారు. వర్సిటీలో ఈనెల 2, 3 తేదీలలో నిర్వహించిన వర్సిటీ జట్టు ఎంపిక పోటీలలో తమ విద్యార్థులు సి.హెచ్.హేమంత్, ఏ.అశోక్‌లు ప్రతిభ కనపరచి జట్టులో స్థానం సాధించారని వివరించారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలలో ఏఎన్‌యూకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ..

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని వేముల దివ్య (9వ తరగతి) అండర్-14 విభాగంలో జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు అర్హత పొందినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు (పీడీ) ఆర్.రాధాకృష్ణమూర్తి బుధవారం తెలిపారు. పీడీ మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరు 29 నుంచి 30 వరకు చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్కూల్ గేమ్స్ పోటీల విభాగంలో జాతీయ స్థాయి పోటీల్లో వేముల దివ్య ఎంపికైనట్లు చెప్పారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి వేముల దివ్యను పేరెంట్ కమిటీ చైర్మన్ ముట్లూరి ప్రసాదు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, అబ్దుల్లా, నిర్మల, శ్రీకాంత్ అభినందించారు.

ముఖ్యమంత్రికి అభినందనలు

నరసరావుపేట: వేమన మహాకవి జయంతిని ఈనెల 18వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అధికారిక పూర్వకంగా నిర్వహించాలని ఆదేశాలు జారీచేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వేమన సాహిత్య ప్రచారకులు వేమన మహేష్ బుధవారం అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. దీని వలన వేమన సాహిత్యం ప్రజలకు మరింత చేరువ అవుతుందన్నారు. అభినందించిన వారిలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమారెడ్డి, పద్యకవి ఈపూరి వెంకటరెడ్డి, శ్రీనాథపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్ణ చినరామిరెడ్డి ఉన్నారు.

నేడు శావల్యాపురానికి ఎమ్మెల్యే రాక

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు నూతన పింఛను వారోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదుగా నూతన పింఛనుదారులకు నగదు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో నూతనంగా 216 పింఛనుదారులు అర్హత పొందారన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

నరసరావుపేట టౌన్: జూద శిబిరంపై దాడులు నిర్వహించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సెబ్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి బుధవారం తెలిపారు. పమిడిపాడు గ్రామంలో పేకాట ఆడుతున్నారన్నా సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. అక్కడ జూదానికి పాల్పడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్దనుంచి రూ.27 వేల రూపాయల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

చిలకలూరిపేట: ప్రకృతి వ్యవసాయంతో అటుభూమికి, ఇటు మనుషుల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయాధికారి కె.ఐలయ్య చెప్పారు. మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న జి.నాగభూషణం పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన మొక్కలకు మేలు చేసే సూక్ష్మజీవులు సమృద్ధిగా ఉంటాయని, అవి మొక్కలకు మంచి పోషకాలు అందిస్తాయని చెప్పారు. కాషాయాల ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, కోడిగుడ్డు నిమ్మరస ద్రావణం, బెల్లం ద్రావణం భూమికి, మొక్కలకు అందించటం వలన భూమి ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల 18 నుంచి 25 రకాల గడ్డ, దుంప, తీగ, ఆకుకూరలు వంటి విత్తనాలు భూమిలో వేసుకొని 45 రోజుల తర్వాత కలియదున్నటం వలన భూమికి కావల్సిన అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా అందుతాయని, భూసారం పెరిగి పంటలు బాగా పండుతాయని చెప్పారు. రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జి బి.మనోజ్‌కుమార్, పీఆర్‌పీ వై.భాస్కర్ పాల్గొన్నారు.



ఫారం నెం. 14 (రెగ్యులేషన్ 33 (2))
రికవరీ ఆఫీసర్-II కార్యాలయము
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
(ఆర్థిక సేవల శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
31-31-21, నారాయణ భవనం, సాయిబాబా స్ట్రీట్, దాబా గార్డెన్స్, విశాఖపట్నం - 530 020

డిమాండ్ నోటీసు

(రికవరీ ఆఫ్ డెట్స్ & బ్యాంక్ రప్ట్సీ యాక్ట్, 1993 లోని సెక్షన్ 25 నుండి 28 మరియు ఆదాయ పన్ను చట్టం 1961కి రెండవ షెడ్యూలులోని రూల్ 2 క్రింద నోటీసు)

RC No./88/2018 — 07-12-2022

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, చిలకలూరిపేట బ్రాంచ్, చిలకలూరిపేట
వర్సెస్
M/s శ్రీనివాస ఫ్లైయాష్ బ్రిక్ ఇండస్ట్రీస్ & మరొకరు

దిగువ తెలిపిన వారికి

(CD 1) M/s శ్రీనివాస ఫ్లైయాష్ బ్రిక్ ఇండస్ట్రీస్ డోర్ నెం.8-11, కొండకావూరు గ్రామం, నరసరావుపేట మండలం, గుంటూరు-522408

(CD 2) శ్రీగుర్రపుసాల శ్రీనివాస్, తండ్రి వెంకయ్య, డోర్ నెం.8-11, కొండకావూరు గ్రామం, నరసరావుపేట మండలం, గుంటూరు-522408

OA/870/2017లో రూ.25,07,328/- (సిసి లోన్ అకౌంట్ క్రింద రూ.6,64,466/- మరియు TL అకౌంట్ క్రింద రూ.18,42,862/-) మొత్తమును 3-10-2017 నుండి వసూలయ్యే తేదీ వరకు నెలవారీ వాయిదాలతో సంవత్సరానికి 12.00% వంతున భవిష్యత్ వడ్డీ మరియు వ్యయాలతో మీ నుండి (ఉమ్మడిగా లేదా విడివిడిగా/పూర్తిగా/పరిమితంగా) బకాయిగా ఉన్న మొత్తం రాబట్టుకునేందుకు ప్రిసైడింగ్ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం వారిచే ఆమోదించబడిన ఉత్తర్వులకు అనుగుణంగా జారీచేసిన రికవరీ సర్టిఫికెట్ ప్రకారం ఇది ప్రకటించబడినది.

2. ఈ నోటీసు అందిన తేది నుండి 15 రోజులలోగా పైన తెలిపిన మొత్తం చెల్లించవలసిందిగా మిమ్మల్ని ఇందుమూలంగా ఆదేశించడమైనది. ఆ విధంగా చేయుటలో విఫలమైతే రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టూ బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్ 1993 మరియు దాని క్రింద చేయబడిన రూల్స్‌కు అనుగుణంగా రికవరీ చేపట్టబడును.

3. తదుపరి విచారణ తేదీన లేదా అంతకు ముందుగా మీ ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో ప్రకటించవలసిందిగా మిమ్మల్ని ఇందుమూలంగా ఆదేశించడమైనది.

4. తదుపరి ప్రొసీడింగ్స్ కొరకు 11-1-2023న ఉ.10.30 గం.లకు దిగువ సంతకందారు సమక్షంలో హాజరు కావలసిందిగా ఇందుమూలంగా మిమ్మల్ని ఆదేశించడమైనది.

5. పైన తెలిపిన మొత్తమునకు అదనంగా దిగువ తెలిపినవి కూడా చెల్లించుటకు మీరు బాధ్యులై ఉన్నారు.

a) ఈ నోటీసు అమలు ప్రొసీడింగ్స్ తరువాత వెంటనే మొదలయ్యే కాలానికి చెల్లించ తగు అట్టి వడ్డీ.

b) సర్టిఫికెట్ మొత్తం రాబట్టుకొనేందుకు ఈ నోటీసు అందచేయుటకు మరియు ఇతర ప్రక్రియ కొరకు సంబంధించిన అయిన అన్ని వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులు.

నాచే స్వయంగా ఈ ట్రిబ్యునల్ సీల్‌తో 7-12-2022న ఇవ్వబడినది.

(బి.ఎస్.ఎస్.వి.ఎస్.కె. బంగార్రాజు) రికవరీ ఆఫీసర్